క్లుప్తంగా

సీఎంను కలిసిన ఎమ్మెల్యే చిట్టిబాబు



సీఎం జగన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సామర్లకోటలో జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఐదుగురికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వారికి సంబంధించిన రికార్డులను సీఎంకు అందజేశారు. దీనికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే చిట్టిబాబు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సఖినేటిపల్లి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాజోలు సీఐ ఆర్.గోవిందరాజులు అన్నారు. సఖినేటిపల్లిలో ఎస్సై ఎస్.రాము అధ్యక్షతన మండల పరిధిలోని చర్చిలు, దేవాలయాలు, మసీదులకు సంబంధించిన నిర్వాహకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీటి నిర్వహణపై పలు సూచనలు చేశారు. దొంగతనాలు జరుగుతున్నందున విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొబైల్ నిర్వహణలో ఎంతో ముందుజాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు.

ఆదిశైవ సంఘం నిరసన

పి.గన్నవరం: రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆదిశైవ సంఘ అధ్యక్షుడు యనమండ్ర సీతారామశర్మను అర్చక సమాఖ్య నాయకులు కించపరిచేలా మాట్లాడటంపై మండల ఆదిశైవ సంఘ సభ్యులు నిరసన తెలిపారు. స్థానిక గరుడేశ్వర స్వామి ఆలయంలో సంఘం మండల అధ్యక్షుడు భైరవభొట్ల సత్య వెంకట నారాయణమూర్తి అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో సీతారామశర్మను అర్చక సమాఖ్య నాయకులు ఆత్రేయబాబు, రామశ్రీనివాస్ దూషించారని నాయకులు తెలిపారు. ఇది రాష్ట్రంలోని ఆదిశైవ సభ్యులందరినీ అవమానించినట్టేనని అన్నారు. తక్షణమే రాష్ట్ర అధ్యక్షుడు సీతారామశర్మకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు విలపర్తి రాంబాబు, సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు స్థల పరిశీలన

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ ప్రాంగణంలో మండపాటి కేశవదాసు కాంస్య విగ్రహ ప్రతిష్ఠకు అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం పరిశీలించారు. కేశవదాసు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాల్సిందిగా రాజోలు తాలూకా శ్రీకృష్ణ యాదవ సంఘ సభ్యులు ఇటీవల ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఆ సంఘ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అంతర్వేదిలో స్థల పరిశీలన చేశారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట గురువారం వేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది.

మద్యం, సారా ధ్వంసం

కొత్తపేట: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మద్యం, సారాను గురువారం ధ్వంసం చేశారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 31 వరకూ 70 కేసుల్లో 548 లీటర్ల సారా, 14 కేసుల్లో 256 సీసాల (91 లీటర్లు) అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సరకును జిల్లా అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా సమక్షంలో ఎస్ఈబీ సీఐ, అమలాపురం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మద్దాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఇన్‌చార్జి ఏఈఎస్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై వి.మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి విజయదుర్గమ్మ ఉత్సవాలు

మామిడికుదురు: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకూ శరన్నరాత్ర ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 15వ తేదీ ఉదయం 8.30 గంటలకు చామంతి పూలతో అమ్మవారికి విశేష అర్చన జరుగుతుందన్నారు. 16న మల్లెపూలు, 17న స్వర్ణపుష్పాలు, 18న లిల్లీ పూలు, 19న తామర పుష్పాలు, 20న కనకాంబరాలు, 21న గులాబీలు, 22న పారిజాత పుష్పాలతో అర్చన జరుగుతుందని వివరించారు. 23వ తేదీ విజయదశమి సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజ, అన్న సమారాధన, అదే రోజు అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- వందలాది మందికి ఆరోగ్య సేవలు
- పరిశీలించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు

సఖినేటిపల్లి/అలమూరు/ఆత్రేయపురం/అంబాజీపేట/కొత్తపేట/అయినవిల్లి/పి.గన్నవరం/మామిడికుదురు/రాజోలు: ప్రజారోగ్యమే మహాభాగ్యమని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు గురువారం పలు గ్రామాల్లో జరిగాయి. ఈ సందర్భంగా వందలాది మందికి వైద్యులు, సిబ్బంది 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. సఖినేటిపల్లి మండలం గొంది జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ దొండపాటి రవికుమార్ అధ్యక్షతన ఎంపీడీఓ జి.భీమారావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సందర్శించారు. రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. రోగులను పరీక్షించిన అనంతరం ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ యునుస్‌కు సూచించారు. వైద్య సేవలపై ఆయనతో చర్చించారు. ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన



సఖినేటిపల్లి: గొంది జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య సేవలపై డాక్టర్ యునుస్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

పోషకాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, ఎంపీటీసీ సభ్యుడు కొల్లాబత్తుల శుభాకర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగమణి, జగనన్న కన్వీనర్ల సారథి మండల ఇన్‌చార్జి నల్లి మోహన్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.భాస్కర్, కార్యదర్శి ఎస్ఆర్‌కే రాజు పాల్గొన్నారు.

- ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారం గ్రామ సచివాలయం–1 పరిధిలో సర్పంచ్ లంక వరప్రసాద్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కోనాల పేరెడ్డి, తహసీల్దార్ ఐపీ శెట్టి, కార్యదర్శి పాలింగి రాజు ఆధ్వర్యాన నిర్వహించిన వైద్య శిబిరాన్ని అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత సందర్శించారు. శిబిరంలో వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు అరుణ, షమీ ఉన్నీసా, ఆర్.మల్లికార్జున, పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి పాల్గొని 456 మందికి వైద్య సేవలు అందించారు. కంటి వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి సుమారు 125 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగ కళ్లజోళ్లు అందజేశారు. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న పది మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈఓ పీఆర్డీ పి.రాజ్‌కుమార్, నోడల్ అధికారి నామాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో 602 మందికి వైద్య సేవలు అందించారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ కప్పల శ్రీధర్, సర్పంచ్ కొడమంచిలి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు బందెల రాజేశ్వరి, సమయమంతుల సతీ అనసూయ, కుంచే సత్యవతి, కో ఆప్షన్ సభ్యులు పీఎస్ రెడ్డి జయపాల్, ఎంపీడీఓ నాతి బుజ్జి, ఈఓపీఆర్‌డీ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- అంబాజీపేట మండలం నందంపూడిలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ పితాని మంగాదేవి అధ్యక్షతన నిర్వహించిన శిబిరంలో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందచేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్లు కొండేటి వెంకటేశ్వరరావు, వికాస్ మాట్లాడుతూ పేదల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపేట మండలం మందపల్లిలో ఎంపీడీఓ ఇ మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యాన వివిధ విభాగాల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.
- అయినవిల్లి మండలం తొత్తరమూడి ఎంపీపీ స్కూలు ఆవరణలో జరిగిన శిబిరంలో వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.సునీల్ 492 మందికి వైద్య సేవలు అందించారు. మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు, తొత్తరమూడి సర్పంచ్ వార జయసావిత్రి, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటచార్య, తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మ, వైఎస్సార్ సీపీ అయినవిల్లి శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.
- పి.గన్నవరం మండలం పోతవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ వడలి కొండయ్య ప్రారంభించారు. వైద్యాధికారి శ్రీవల్లి, వైద్య నిపుణులు మౌనిక మణి, కార్తీక్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు 358 మందికి వైద్య సేవలు అందించారు. సర్పంచ్ ఆధ్వర్యాన 10 మంది గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీల కన్వీనర్ కొండేటి వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.
- మామిడికుదురు మండలం పెదపట్నం గ్రామంలో వైద్య శిబిరాన్ని సర్పంచ్ గుబ్బల దుర్గ, ఎంపీటీసీ సభ్యురాలు కడలి పద్మావతి ప్రారంభించారు. ఐదు విభాగాల వైద్య నిపుణులు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేత కొండేటి విశాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
- రాజోలు మండలం కూనవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో సుమారు 350 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ బోనం అచ్యుయ్యనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు: మూలస్థానం అగ్రహారంలో కంటి పరీక్షలు చేస్తున్న నిపుణురాలు శ్రీలక్ష్మి



కొత్తపేట: మందపల్లి వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి



అయినవిల్లి: తొత్తరమూడి శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



పి.గన్నవరం: పోతవరం శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది



మామిడికుదురు: పెదపట్నం శిబిరంలో మందులు అందజేస్తున్న సిబ్బంది

పారదర్శక పాలనతో సంక్షేమానికి శ్రీకారం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనతో సంక్షేమానికి శ్రీకారం చుట్టారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తనయుడు రాపాక వెంకట్‌రామ్‌తో కలిసి శివకోడులో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి చొరవ చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో ఏదైనా సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడేవారన్నారు. ఆ పార్టీకి చెందిన వారికి మాత్రమే పథకాలు అందించేవారని, బ్రోకర్ల వ్యవస్థతో లంచాలు ఇచ్చే వరకూ అర్జీదారులను వేధించేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం అలాంటి వాటికి తావు లేకుండా నిష్పక్షపాతంగా, నిజాయితీగా అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రామారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజా రమణి, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యుడు కటకంశెట్టి ఆదిత్య, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జీ, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు బొమ్మలను పరిశీలించిన కేంద్ర బృందం


మామిడికుదురు: 'ఒక జిల్లా – ఒక ఉత్పత్తి' పథకంలో భాగంగా కొబ్బరి పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కొబ్బరి ఉత్పత్తులు, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు, వాటి నిర్వహణ తీరు, కొబ్బరి ఆధారంగా ఉపాధి పొందుతున్న మహిళల జీవన పరిస్థితులు తదితర అంశాలను పరిశీలించేందుకు ఇన్వెస్ట్ ఇండియా విశ్వవిద్యాలయానికి చెందిన హరిప్రీత్‌సింగ్ ప్రతినిధిగా కేంద్ర బృందం పాశర్లపూడి, పెదపట్నంలంక గ్రామాల్లో గురువారం పర్యటించింది. పాశర్లపూడిలో కొబ్బరి పీచు ఆధారంగా మహిళలు తయారు చేసిన బొమ్మలను పరిశీలించింది. పీచుతో మహిళలు తయారు చేస్తున్న బొమ్మలు, వాటి మార్కెటింగ్, ఈ పరిశ్రమకు అందించాల్సిన ప్రోత్సాహం, తదితర అంశాలను ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం ఈ బృందానికి వివరించారు. పెదపట్నంలంకలో శ్రీసాయి లక్ష్మీ క్వాయర్ ఇండస్ట్రీని బృందం సభ్యులు పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యాన కొబ్బరి రైతులతో మాట్లాడారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమల ద్వారా మరింత ఆదాయం ఆర్జించే దిశగా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్యాంబాబు, డీఆర్‌డీఏ పీడీ కె.శివశంకర్ ప్రసాద్, నాబార్డ్ ఏజీఎం స్వామినాయుడు, హ్యాండీ క్రాఫ్ట్ టీడీ అజయ్, రైతులు వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహలక్ష్మీరావు పాల్గొన్నారు.



పెదపట్నంలంకలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

27న నాక్ బృందం సందర్శన

కొత్తపేట: నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) బృందం ఈ నెల 27, 28 తేదీల్లో స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించనుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ఈ విషయం తెలిపారు. నాక్ బృందం రానున్న నేపథ్యంలో కళాశాలను, పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దడం, ఇతర ఏర్పాట్లపై అధ్యాపకులు, సిబ్బందితో గురువారం ఆయన సమీక్షించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, 1979లో బీఏ, బీకాం గ్రూపులతో, 60 మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ కళాశాల దశల వారీగా అభివృద్ధి చెందిందన్నారు. యూజీసీకి అనుబంధంగా బెంగళూరు కేంద్రంగా పని చేసే నాక్.. డిగ్రీ ఆపై విద్యా సంస్థలకు విద్యా నాణ్యత, సౌకర్యాలు, ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని గ్రేడింగ్ ఇస్తుందని వివరించారు. తొలిసారి 2006, 2014 సంవత్సరాల్లో తమ కళాశాలకు నాక్ బి–గ్రేడ్ గుర్తింపు లభించిందన్నారు. 2019లో కోవిడ్ కారణంగా నాక్ గ్రేడింగ్‌కు వెళ్లడం సాధ్యం కాలేదని, గడచిన ఐదు విద్యా సంవత్సరాల నివేదికను జూన్‌లో పంపించగా ఆగస్టులో ఆమోదించారని వివరించారు. ఈసారి కళాశాలకు మంచి గ్రేడు వస్తుందని ప్రిన్సిపాల్ రాజు ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఐకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.అంకమరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నాక్‌కు సమర్పించిన నివేదికను చూపిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

పందిరి రాట ఏర్పాటు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి సోదరి గుర్రాలక్క అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్ర మహోత్సవాలకు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గురువారం పందిరి రాట వేశారు. అంతకు ముందు ఈ రాటకు అర్చకులు విశేష పూజలు చేశారు. ఈ నెల 15 నుంచి 24 వరకూ నిర్వహించే శరన్నవరాత్ర మహోత్సవాలకు గుర్రాలక్క అమ్మవారి ఆలయం వద్ద, ప్రధాన ఆలయంలోని ఉపాలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారి సన్నిధిలోను భక్తులకు తగిన ఏర్పాట్లు చేశామని సత్యనారాయణ తెలిపారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులూ అమ్మవార్లకు నిత్యం కుంకుమ పూజలు ఏర్పాటు చేశామన్నారు. మహిళా భక్తులు పాల్గొనాలని కోరారు.

రూ.143 కోట్లతో రోడ్ల ఆధునీకరణ

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- కొత్తపేట – ఈతకోట, దేవరపల్లి – వెదిరేశ్వరం రోడ్ల పనులు ప్రారంభం

కొత్తపేట/రావులపాలెం: నియోజకవర్గంలో వివిధ రోడ్లకు సుమారు రూ.143 కోట్లు మంజూరు చేయించగా, ఇప్పటికే అనేకం ఆధునీకరించామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట – ఈతకోట ఆర్‌అండ్‌బీ రోడ్డును గత ఏడాది ఆధునీకరించారు. ఇందులో స్థానిక సత్యా సెంటర్ నుంచి పెదగూళ్లపాలెం వరకూ పనులు అప్పట్లో మిగిలిపోయాయి. 1.8 కిలోమీటర్ల మేర దీని నిర్మాణ పనులకు బీటీ, సీసీ రోడ్డు స్పెషల్ రిపేర్స్ కింద రూ.85 లక్షలతో స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజి వద్ద ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గురువారం శ్రీకారం చుట్టారు. మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో కౌశిక డ్రైన్‌పై నుంచి సంతోష్ నగర్ గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో కనీస మరమ్మతులకు కూడా నోచుకోని అనేక రోడ్లను సుమారు రూ.83 కోట్లతో ఆధునీకరించామని చెప్పారు. ఇంకా వివిధ రోడ్లకు సుమారు రూ.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రూ.2.45 కోట్లతో కొత్తపేట రోడ్డు, రావులపాలెం మండలం వెదిరేశ్వరం – దేవరపల్లి రోడ్డు పనులు ప్రారంభించామని వివరించారు. రూ.30 లక్షలతో ఆత్రేయపురం మండలం లొల్ల – ఉచ్చిలి రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. కొత్తపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణ రోడ్లను ఆధునీకరించిందని జగ్గిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ పర్సన్ ముసునూరి వెంకటేశ్వరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, చావలి సుబ్బరాయశాస్త్రి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, బండారు కృష్ణమూర్తి, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఆర్‌అండ్‌బీ డీఈ కె.సత్యవేణి, ఏఈఈ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- రావులపాలెం మండలం వెదిరేశ్వరం నుంచి కేతరాజుపల్లి మీదుగా ఈతకోట – కొత్తపేట రోడ్డు వరకూ రూ.1.30 కోట్లతో నిర్మించనున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఇందులో భాగంగా సచివాలయాలు, రైతుభరోసా కేంద్ర భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, నాడు – నేడులో పాఠశాలల ఆధునీకరణతో పాటు రోడ్లు నిర్మిస్తోందని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి, సర్పంచ్ అంబటి సుబ్బలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, జేఈ మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేతరాజుపల్లి వద్ద రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



సభలో మాట్లాడుతున్న ఎంపీపీ అన్నపూర్ణ

ఆత్రేయపురం: ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయం వద్ద పదిహేనో విడత సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ నాతి బుజ్జి ఆధ్వర్యాన డ్వామా పీడీ మధుసూదన్ అధ్యక్షతన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ రూ.10,35,39,000తో 542 పనులు చేపట్టారు. వీటిపై గత నెల 30 నుంచి ఈ నెల 11 వరకూ సామాజిక తనిఖీ నిర్వహించారు. మస్తరు నమోదులో పొరపాట్లతో పాటు బొబ్బర్లంక, పేరవరం, రాజవరం తదితర గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా కొన్ని మొక్కలు చనిపోయినట్టు గుర్తించారు. మస్తర్లలో అవకతవకలకు సంబంధించి సిబ్బంది నుంచి రూ.30,686 రికవరీ చేయాలని, చనిపోయిన వాటి స్థానంలో తిరిగి మొక్కలు నాటాలని డ్వామా పీడీ మధుసూదన్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బోణం సాయిబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఉపాధి హామీ ఏపీఓ భారతి, జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వరరావు, ఎస్ఆర్‌పీ సీహెచ్‌పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొత్తపేట: మధ్యాహ్న భోజన పథకం (ఎండీఎం) నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ హెచ్చరించారు. భోజనం వండి, వడ్డించడం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై ఈ పథకం నిర్వాహకులకు స్థానిక మండల వనరుల కేంద్రంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పాఠశాల ఆవరణలోనే జరగాలని, ఆ పరిసరాలు, వంటకు ఉపయోగించే పాత్రలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నాణ్యమైన కూరగాయలు, వంట సరకులు ఉపయోగించాలన్నారు. నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వంట చేసే ముందు, వడ్డించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కె.లీలావతి కూడా పాల్గొన్నారు.

కంటిని సంరక్షించుకోవాలి

ఆలమూరు: ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా మెరుగైన దృష్టి, అంధత్వ నివారణ సాధ్యమవుతుందని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.మల్లికార్జున్, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది గురువారం ర్యాలీలు నిర్వహించి, ప్లకార్డులు ప్రదర్శించారు. కంటి సంరక్షణ ప్రాధాన్యం, అంధత్వ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.